సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం | 26 | జూలై | 2024



కలిసిరాని 'కౌలు' IIలో ▸

ఏటా కౌలు ధరలు పెరుగుతున్నాయి. సాగుకు పెట్టుబడులూ అధికమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమందక కౌలు రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు.



పండ్ల తోటలకు రాయితీ

పండ్లతోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉపాధిహామీ పథకం కింద రాయితీలు ఇస్తోంది. దీంతో పండ్లతోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

విద్యార్థినులకు పతకాలు



పతకాలతో విద్యార్థినులు

ఆదిలాబాద్‌రూరల్: హిందుస్థాన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో చించుఘాట్ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పెందూర్ రూప 30 మీటర్ల డిస్టెన్స్‌లో బంగారు పతకం, సిడాం శ్రీజ 20 మీటర్ల డిస్టెన్స్‌లో వెండి పతకం సాధించిన విషయం తెలిసిందే. గురువారం వారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీడీ దిలీప్‌కుమార్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థినుల వెంట కోచ్ కత్లె మారుతి తదితరులున్నారు.

యాప్‌లో హాజరు నమోదు చేయాలి

ఎదులాపురం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పాఠశాలలో నమోదైన ప్రతీ విద్యార్థి వివరాలు ఎఫ్ఆర్ఎస్ మొబైల్ యాప్‌లో రిజిస్టర్ చేసి, తప్పనిసరిగా హాజరు వేయాలని డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు ప్రతీరోజు నమోదు చేయాలని, దీన్ని అత్యంత ప్రధాన్య అంశంగా పాటించాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది సహకారంతో ప్రతీరోజు అన్ని పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు వందశాతం నమోదయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోండి

ఎదులాపురం: కొత్తగా పట్టాపాస్ పుస్తకం పొందిన రైతులు, గతంలో పట్టాపాసు పుస్తకం పొంది రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోనివారు ఆగస్టు 5వ తేదీలోపు ఆయా మండలాల వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని డీఏవో పుల్లయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 28వరకు డిజిటల్ సంతకం కలిగిన పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ద్వారా పోడు, అటవీహక్కు పట్టా పొందిన రైతుల కూడా దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏళ్ల రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు నామిని వివరాల మార్పులు, చేర్పులను ఈ నెల 30వ తేదీలోపు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్‌కార్డు, పట్టాపాసు పుస్తకం, నామిని ఆధార్ జిరాక్స్ ప్రతులు దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

సాయ్ కేంద్రానికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న గోవర్ధన్

ఆదిలాబాద్‌రూరల్: వనపర్తిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కేంద్రానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొలాం ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మడావి ప్రసాద్, కుర్సెంగే ధనుకుమార్ ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి మాట్లాడారు. సాయ్ కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని విద్యార్థులకు సూచించారు. కాగా, విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఐటీడీఏ ఈఈ భీంరావు రూ.2వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కే పార్థసారథి, ఏఈ సుధాకర్, ఏటీడీవో నిహారిక, హెచ్ఎం నారాయణరావు, కోచ్‌లు జే రవీందర్, శ్రీనివాస్, సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







మోదం.. ఖేదం

- రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన
- సంక్షేమ బడ్జెట్ అంటున్న కాంగ్రెస్
- 'అవాస్తవికం..' అంటున్న బీజేపీ
- ప్రజలకు భరోసా లేదన్న బీఆర్ఎస్
- బడ్జెట్‌లో కుప్టి ప్రాజెక్ట్ ప్రస్తావనేది?
- ఎకో టూరిజానికి 'కుంటాల' ఎంపిక

సాక్షి, ఆదిలాబాద్: కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇది రైతులు, పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిందని కాంగ్రెస్ అంటోంది. ఇది అవాస్తవిక బడ్జెట్ అని, గొప్పలు చెప్పుకోవడం తప్పిస్తే ఇందులో ఏమీ లేదని బీజేపీ విమర్శిస్తోంది. ప్రజానీకానికి ఎలాంటి భరోసానివ్వలేక పోయిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని చెబుతున్నారు. రైతులు వ్యవసాయ రంగంలో నిలదొక్కుకునేలా రూపొందించినట్లు పేర్కొంటున్నారు. పేద ప్రజల జీవన ప్రమాణాల్లో ఈ బడ్జెట్ మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమాకు కేటాయించిన నిధులు రైతుల్లో ఆనందాన్ని నింపుతోందని పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా రూ.5లక్షల ఆర్థికసాయం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెబుతున్నారు. దీంతో పేదల సొంతింట కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి రంగానికి బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపు చేసి వాస్తవ బడ్జెట్ రూపొందించినట్లు కాంగ్రెస్ పేర్కొంటోంది.

విమర్శలు గుప్పిస్తున్న ప్రతిపక్షాలు

బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని బీజేపీ ఆరోపిస్తోంది. నెలకు రూ.4వేలు ఇస్తామని కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించినప్పటికీ దానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని పేర్కొంటోంది. ఈ పథకం ఎత్తేసినట్టేనా? అని ఎద్దేవా చేస్తోంది. ఇరిగేషన్‌కు ప్రాధాన్యత తగ్గినట్టు అనిపిస్తోందని బీజేపీ పేర్కొంటోంది. ఇది గొప్పలకు పోవడం తప్పిస్తే ప్రజలకు మేలు చేసే బడ్జెట్‌లా లేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అవేమీ ప్రస్తావించలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ప్రజానీకానికి ఎలాంటి భరోసానివ్వలేక పోయారని పేర్కొంటోంది. దళితబంధు, దళిత బీమా, రైతుబంధు, రైతు బీమా, మత్స్యకారుల భరోసా, యాదవులకు గొర్రెల పంపిణీ, మహిళా సంక్షేమం, షాదీముబారక్, కల్యాణలక్ష్మి లాంటి పథకాలపై కనీస స్పష్టత ఇవ్వలేదని వపక్షాలు మండిపడుతున్నాయి.

ఎకో టూరిజంలో కుంటాల జలపాతం

ఎకో టూరిజంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు స్పాట్‌లను ఎంపిక చేయగా, అందులో కుంటాల జలపాతం కూడా ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ అభయారణ్యంతోపాటు కుంటాల జలపాతాన్ని ఇందులో తీసుకున్నారు. కుంటాల జలపాతం వద్ద ట్రైబల్ ఎకో టూరిజం కింద రిసార్ట్ నిర్మాణం, టూరిస్టుల విడిది కోసం వసతి, ఎకో ఫ్రెండ్లీ కాటేజెస్ నిర్మాణం చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఉట్నూర్ ఐటీడీఏ పీవో ద్వారా రూ.3.81లక్షలతో వివిధ పనులు చేపట్టబోతున్నారు.

ప్రాజెక్టులకు దక్కని ప్రాధాన్యం

జిల్లాలో నిర్మాణంలో ఉన్న కొరటా–చనాక బ్యారేజ్‌ను పూర్తి చేసేందుకు నిధులు అవసరం ఉండగా, ప్రభుత్వం స్వల్పంగా విడుదల చేసినట్లు తెలుస్తోంది. 2018 నుంచి నేరడిగొండ మండలం కుప్టి గ్రామం వద్ద నిర్మించతలపెట్టిన ప్రాజెక్ట్‌కు ఈసారి కూడా మోక్షం కలగలేదు. ఇక జిల్లాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల వారీగా విడుదల చేసిన నిధుల విషయంలో ప్రయోజనం దక్కనుంది. కేంద్ర ఫసల్ బీమాలో రాష్ట్ర ప్రభుత్వం చేరడం ద్వారా రైతులకు పంటల బీమా అంశంలో ఉపయోగపడనుంది. ఇందుకు సంబంధించి ప్రీమియం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం ద్వారా వెనుకబడిన ఈ ప్రాంతంలోని రైతులకు ఊరటనిచ్చింది. తద్వారా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులకు పరిహారం అందనుంది.

ఇది వాస్తవ బడ్జెట్



ప్రజల అవసరాలను గుర్తించి ఉన్నతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు. అభివృద్ధి, సంక్షేమం ప్రాతిపదికన బడ్జెట్ రూపకల్పన జరిగింది. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రాధాన్యతనిచ్చారు. కడెం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించారు. ఇది వాస్తవ బడ్జెట్.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

ఏ వర్గానికీ న్యాయం చేయలె



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. తొందరగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోంది. ఇది అవాస్తవిక బడ్జెట్.

– జోగు రామన్న, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

బడాయి బడ్జెట్..



ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేసే విషయంలో చిత్తశుద్ధి చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. ఇది అవాస్తవిక బడ్జెట్. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, నూతన ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. బడాయికి పోవడం తప్పితే ఈ బడ్జెట్‌లో ఏమీలేదు.

– సుహాసినీరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న నరేందర్ రాథోడ్

గుడిహత్నూర్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలనున్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విషజ్వరాలతో పాటు డెంగీ, మలేరియా, అతిసార, చికెన్‌గున్యా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని ఆదేశించారు. ప్రతీ శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ఏడుగురికి కొత్తగా పోస్టింగ్

- ముగ్గురి పాత పోస్టింగ్‌లు రద్దు

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల వ్యవహారంపై కొద్దిరోజులుగా వివాదం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై నియమించారని కొన్ని సంఘాలు ఆందోళన చేపట్టగా, తమకు అనుకూలమైన వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ కొన్ని సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ పరిస్థితిని వివరిస్తూ 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. ఇదివరకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై నియమించగా, ఉపాధ్యాయ సంఘాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం కావడంతోపాటు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనికి స్పందించిన కలెక్టర్ అర్హులైన, సామర్థ్యం కలిగిన వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ డీఈవో ప్రణీతను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆమె గురువారం పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన పోస్టింగ్‌ల్లో ఉన్న ముగ్గురిని తక్షణమే విధులను రిలీవ్ చేయాలంటూ ఆదేశించారు. రిలీవ్ అయిన సదరు ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విధుల్లో చేరాలని సూచించారు.

'విద్యారంగానికి 7.31 శాతమేనా'

ఎదులాపురం: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,292 కోట్లు (7.31 శాతం) మాత్రమే నిధులు కేటాయించడం సిగ్గు చేటని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని విద్యార్థులతో కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు కలిపి అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఇవి ఏ మూలకు సరిపోతాయో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని కోరారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనుల ప్రారంభానికి చర్యలు



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షి షా

తాంసి: ధనోర నుంచి కరంజి (టి) వరకు అంతర్రాష్ట్ర రోడ్డు పనులు వానాకాలం ముగిసిన వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం మండలంలోని అర్లి(టి) జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వనమహోత్సవానికి హాజరై మొక్కలు నాటారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుసుకుని వెంటనే డీఈవోతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని ఆదేశించారు. ఉరుస్తున్న తరగతి గదికి వెంటనే మరమ్మతు చేపట్టాలని ఏఈకి సూచించారు. అర్లి(టి)లోని గ్రామీణ బ్యాంక్‌ను సందర్శించి మేనేజర్ కిరణ్‌తో మాట్లాడారు. రుణమాఫీ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భీంపూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. అంతకుముందు భీంపూర్ మండల కేంద్రంలో పంటల నమోదును పరిశీలించి సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్, ఏవో రవీందర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్, అర్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నవీన్, మండల విద్యాధికారి శ్రీకాంత్, ఏఈ సుమంత్, హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, అర్లి(టి) ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఓమయ్య, సభ్యుడు సంతోష్ తదితరులున్నారు.

మహిళాశక్తిని వినియోగించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: మహిళాశక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. ఆదిలాబాద్ మెప్మా పరిధిలో కేటాయించిన మహిళాశక్తి యూనిట్ల గ్రౌండింగ్‌పై గురువారం పట్టణంలోని ఏరియా లెవల్ పదాధికారులు, రిసోర్స్ పర్సన్లకు మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళాశక్తి కార్యక్రమ ఉద్దేశాలు, విధి విధానాలు, గ్రౌండింగ్‌కు అనుసరించాల్సిన కార్యాచరణపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డులకు గాను 83 యూనిట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో గ్రూప్ యాక్టివిటీ కింద రూ.5లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పీఎంఈజీపీ బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందించనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత యూనిట్లకు ముద్ర, స్త్రీనిధి ద్వారా అవసరమైన నిధులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో అభిరుచి గల ఏఎల్ఎఫ్‌లు యూనిట్ల స్థాపనకు ముందుకురావాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. మెప్మా డీఎంసీ శ్రీనివాస్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ పూర్ణచందర్, మేనేజర్ ఐలమ్మ, సెక్షన్ ఇన్‌చార్జి వెంకటేశ్ తదితరులున్నారు.

'సాత్నాల'కు జలకళ

జైనథ్: వారం క్రితం డెడ్ స్టోరేజీలో ఉన్న సాత్నాల ప్రాజెక్ట్ ఇటీవల కురిసిన వర్షాలకు జలకళను సంతరించుకుంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 24వేల ఎకరాల ఆయకట్టు కలిగి 286.5మీటర్ల ఎఫ్ఆర్ఎల్, 1.24టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యమున్న ఈ ప్రాజెక్ట్‌లోకి క్రమంగా నీరు చేరుతోంది. ప్రస్తుత వర్షాలకు సాత్నాల వాగు పొంగి ప్రవహించడంతో ప్రాజెక్ట్‌లోకి నీళ్లు చేరుతున్నాయి. ప్రస్తుతం 284.60మీటర్ల ఎత్తులో 0.834టీఎంసీ నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా ప్రాజెక్ట్‌లోకి 550క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోందని, వర్షాలు ఇలాగే కొనసాగితే త్వరలోనే పూర్తిగా నిండే అవకాశముందని తెలిపారు. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



వరద నీటితో కళకళలాడుతున్న సాత్నాల ప్రాజెక్ట్

'పట్టణ ప్రగతి' ఆగింది

- ఏడాది క్రితం నిలిచిన నిధులు
- నిలిచిన రూ.9కోట్ల విలువైన పనులు
- చిన్నపాటి పనులూ చేయలేని దుస్థితి



నిధులు రాక నిలిచిన ఇండోర్ స్టేడియం నిర్మాణం

కైలాస్‌నగర్: పట్టణాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 24న ప్రవేశపెట్టిన 'పట్టణ ప్రగతి' కార్యక్రమం నిలిచింది. 'పట్టణ ప్రగతి' ఆరంభం నుంచి జిల్లాలోని ఏకైక ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.1.29 కోట్లు వచ్చేవి. వాటి ద్వారా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశముండేది. కానీ, ఏడాదిగా నిధుల విడుదల పూర్తిగా నిలిచింది. ఒక్క రూపాయి రాకపోవడంతో పట్టణాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పన్నులు, లైసెన్స్‌లు ఇతర వనరుల కింద వచ్చే ఆదాయం మున్సిపల్ కార్మికుల వేతనాలకే సరిపోవడం లేదు. దీంతో అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రగతి నిధులతో ఇదివరకు చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని దుస్థితి నెలకొంది.

ప్రతినెలా రూ.1.29 కోట్లు

జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ అయిన ఆదిలాబాద్ పట్టణానికి పట్టణ ప్రగతి పథకం కింద ప్రతినెలా రూ.1.29 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ, హరితహారం నిర్వహణ, సెంట్రల్ లైటింగ్, భారీ డ్రైనేజీల నిర్మాణం, వివిధ భవన నిర్మాణాలు చేపట్టే అవకాశముండేది. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి అందిన నిధుల ద్వారా పట్టణంలోని ప్రధాన చౌక్‌లన్నింటినీ సుందీకరించారు. రూ.2 కోట్లతో పట్టణంలో నిఘా కోసం అవసరమైన కమాండ్ కంట్రోల్ రూం భవనాన్ని నిర్మించారు.

నిధులు రాక.. ప్రగతి లేక

పట్టణ ప్రగతి నిధులు చివరిసారిగా 2023 జూన్‌లో కేసీఆర్ సర్కారు విడుదల చేసింది. వారి ప్రభుత్వమే డిసెంబర్ వరకు అధికారంలో ఉన్నప్పటికీ ఆ తర్వాత నిధుల విడుదల నిలిపివేసింది. ఆరు నెలల పాటు నయాపైసా విడుదల చేయలేదు. అదే ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయలేదు. కార్యక్రమాన్ని కొనసాగిస్తారా.. లేదా.. అనే దానిపై కూడా ఇప్పటివరకు స్పష్టతలేదు. పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం నిధులే కీలకం. ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యే, ఎంపీ నిధులనూ గతంలో కేటాయించేవారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా ఇతర ఏ నిధులు రావడం లేదు. దీంతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది.

కార్మికుల వేతనాలకు నిధుల కటకట

ట్రేడ్ లైసెన్స్‌లు, ప్రాపర్టీ ట్యాక్స్ ఇతర వనరుల కింద అందే నిధులు కార్మికుల వేతనాలకే సరిపోవడం లేదు. ప్రస్తుతం కార్మికుల రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త పనులు చేపట్టే అవకాశం ఎలాగూ లేదు. ఇప్పటికే రూ.9 కోట్లతో వివిధ వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు నిధులు లేక అర్ధంతరంగా నిలిచాయి. వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.30 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి ఎలా చెల్లించాలో తెలియక బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే గాని పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

రూ.50కోట్లు విడుదలైతేనే..

'పట్టణ ప్రగతి' కింద రావాల్సిన నిధులు ఏడాదిగా నిలిచాయి. మూడునెలలకోసారి వస్తున్న రూ.80లక్షల 15వ ఆర్థికసంఘం నిధులు ఎటూ సరిపోవడం లేదు. ట్రేడ్ లైసెన్స్‌లు, పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం కార్మికుల వేతనాలకే చాలడం లేదు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తే కార్మికులకు సకాలంలో వేతనాలు అందించగలుగుతాం. గతంలో మంజూరైన రూ.50 కోట్ల నిధులివ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. అవి విడులైతే అభివృద్ధి పనులు చేపట్టే అవకాశముంది.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి



పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్సై

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో గల శ్రీ గణపతి ఆలయం వద్ద ఒకరు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై గణేశ్ సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతని జేబులో చిన్న కత్తి ఉన్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప పట్టివేత

కుభీర్: పార్డి(కె)లో గురువా రం కలప పట్టుకున్నట్లు డీఆర్‌వో ఇస్పానొద్దీ న్ తెలిపారు. కలప విలువ రూ.17,529 ఉంటుందన్నారు. కలప ఎవరు దాచారో ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ లెనిన్ ఉ న్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్: మండలంలోని గిమ్మలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం దాడులు నిర్వహించగా గిమ్మ గ్రామానికి చెందిన నరేందర్, రమేశ్, కిషన్, రామన్న, గొరన్న, పరమేశ్వర్ పేకాట ఆడుతూ దొరికినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.14,580 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిస్తే 8712659916 (సీఐ), 8712659929 (ఎస్సై) నంబర్లకు ఫోన్‌లో సమాచారం అందించాలని కోరారు.

బస్సు కోసం వినతి



ఆర్‌ఎంకు విన్నవిస్తున్న బెల్లాల్ గ్రామస్తులు

కడెం: జగిత్యాల–కడెం వయా రాయికల్, బోర్నపల్లి, చిన్నబెల్లాల్, పెద్దబెల్లాల్, కొండుకూర్ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామస్తులు కోరారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతునానరని తెలిపారు. గతంలో ఈ రూట్‌లో నడిచిన బస్సును పునరుద్ధరించాలని కరీంనగర్‌లో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరితకు గురువారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వెంకటరమణయాదవ్, రాములు, ఇల్యాస్, సృజన్, నరేశ్, వెంకటేశ్, సుగుణ ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

TO-LET

■ 1200Sft నుండి 2400Sft వరకు కమర్షియల్ బిల్డింగ్ షాప్స్, బ్యాంక్, ఫైనాన్స్, ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. ఇ.నెం. 8-544, శ్రీనివాస్ టాకీస్ దగ్గర, మేన్‌రోడ్, మంచిర్యాల. సంప్రదించండి సెల్: 9959957741, 9848578233 [K-1187164]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185365]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

కలిసిరాని కౌలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతుపేరు అశోక్ రెడ్డి. బేల మండలంలోని పాటన్‌కు చెందిన కౌలురైతు. కొన్నేళ్లుగా భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ. 20 వేల చొప్పున ఐదెకరాలకు రూ.లక్ష భూమి యజమానికి చెల్లించాడు. దున్నడం, విత్తనాలు, ఎరువులు, మందులు, కలుపుతీత, తదితర ఖర్చులకు ఎకరాకు రూ.25 వేలు అవుతుందని తెలిపాడు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోతే ఏడాదిపాటు చేసిన కష్టం వృథా కావడమే కాకుండా పెట్టుబడి, సాగు ఖర్చులు మీదపడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది కేవలం ఒక్క రైతు ఆవేదనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ కౌలు రైతు పరిస్థితి ఇదే.

- ఏటా పెరుగుతున్న కౌలు ధరలు
- ప్రభుత్వం నుంచి అందని సాయం
- నష్టాల్లో ఊబిలో కూరుకుపోతున్న కౌలు రైతులు
- ఉమ్మడి జిల్లాలో 1,17,313 మంది..

ఇచ్చోడ: పంట రుణాలు, సబ్సిడీపై ఎరువులు, బ్యాంకులో రుణాలు, ప్రభుత్వం నుంచి అందని సాయంతో కౌలు రైతులు కష్టాల కడలిలో ఉన్నారు. పట్టాదారుల వద్ద భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న కౌలుదార్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత అందడంలేదు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి వ్యవసాయాన్నే నమ్ముకున్న కౌలురైతులు ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాదైనా కాలం కలిసిరాకపోతుందా అని వ్యవసాయాన్నే నమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలుకోసం తెచ్చిన అప్పులు కట్టలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడి తనువు చాలిస్తున్నారు.



భూమి చదును చేస్తున్న కౌలు రైతు(ఫైల్)

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కౌలు రైతులు
ఆదిలాబాద్	28,763
ఆసిఫాబాద్	26,754
నిర్మల్	33,212
మంచిర్యాల	28,584

ఏటా పెరుగుతున్న కౌలు

కౌలు ధరలు ఏటా పెరిగిపోతున్నాయి. గతంలో ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఉండేది. కానీ ప్రస్తుతం కౌలుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తీసుకుంటున్నారు. బోర్లు, బావులు ఉన్నభూములకు మరికొంత ఎక్కువే చెల్లించాల్సి ఉంటుంది.

కాలం కలిసొస్తే సరే...

కౌలు రైతులు లక్షల్లో ఖర్చు చేసి పంటలు సాగు చేస్తుంటారు. కానీ కాలం కలిసివస్తే సరే.. లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అప్పులు తీర్చలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 19 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఏడుగురు కౌలురైతులే ఉన్నారు.

అందని ప్రభుత్వ సాయం...

కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడంలేదు. కౌలు రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో పెట్టకపోవడంతో వారికి కన్నీరే మిగులుతోంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ ఎన్నికల తర్వాత దాని ఊసే ఎత్తకపోవడంతో కౌలు రైతులు మరోసారి భంగపాటుకు గురికాక తప్పలేదు.

రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ఆత్మహత్య చేసుకున్న కౌలురైతులకు ప్రభుత్వం రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. త్రీసభ్య కమిటీ ద్వారా విచారణ జరిపించి కౌలురైతులను అదుకోవాలి. 194 జీవో ప్రకారం మరణించిన రైతుకు రూ.6 లక్షల నష్టపరిహారం అందించి అదుకోవాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్

నిజాయతీ చాటుకున్న డ్రైవర్, కండక్టర్



ప్రయాణికుడికి నగదు అందిస్తున్న అధికారులు

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో గురువారం క్యాష్‌బ్యా గ్ పోగొట్టుకున్న ప్రయాణికుడికి డ్రైవర్, కండక్టర్ బ్యాగును అందించి నిజాయతీ చాటుకున్నారు. నిజామాబాద్ నుంచి నిర్మల్ బయలుదేరిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు రూ.2 లక్షల నగదు గల బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయి నిర్మల్ బస్టాండులో దిగిపోయాడు. డ్రైవర్ తాజొద్దీన్, కండక్టర్ రాజు బ్యాగ్‌ను డిపోకు తీసుకువచ్చి అధికారుల సమక్షంలో తెరిచిచూడగా డబ్బుల కట్టలు ఉన్నాయి. ఆ బ్యాగ్ లో ఉన్న సమాచారం మేరకు అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఇంజనీర్ నవీన్ కుమార్, విజిలెన్స్ సెక్యూరిటీ ఎస్సై దయానంద్ ప్రయాణికుడు సురేష్‌ను డిపోకు పిలిపించి బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ..

ఆర్టీసీ బస్సులో రూ.25 వేల విలువ చేసే ఫోన్‌ను పోగొట్టుకున్న ప్రయాణికుడికి అఫ్రోజ్ అనే డ్రైవర్ గురువారం ఫోన్ అందించి నిజాయతీని చాటుకున్నాడు. ఈనెల 24న రాత్రి 10 గంటలకు జేబీఎస్‌లో నిర్మల్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఎక్కిన ప్రయాణికుడు మరుసటి రోజు ఉదయం మూడు గంటలకు నిర్మల్ బస్టాండ్‌లో సీట్‌పై ఫోన్ మర్చిపోయి దిగిపోయాడు. గమనించిన డ్రైవర్ ఫోన్‌ను చార్ట్ కంట్రోలర్‌కు అప్పజెప్పాడు. ఫోన్ కాల్ ద్వారా ఆ ప్రయాణికుడిని బస్టాండ్‌కు పిలిపించి అందజేశారు.

పెచ్చులూడిపడిన తిర్పెల్లి పాఠశాల పైకప్పు



వర్షానికి తడిసిన తరగతి గది

- తప్పిన ప్రమాదం

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రా థమిక పాఠశాలలో పెను ప్రమాదం తప్పింది. మూ డు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం తరగతి గదులు పూర్తిగా తడిసి పోయాయి. దీంతో విద్యార్థులను వరండాలోనే కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ఉదయం 11 గంటల సమయంలో మరో వరండాలో పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో అక్కడ విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఉన్న రెండు గదులు ఉరుస్తున్నాయి

పాఠశాలలో మొత్తం 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం రెండే తరగతి గదులు ఉన్నాయి. అవికాస్తా వర్షానికి ఉరుస్తున్నాయి.

ఆందోళనలో గ్రామస్తులు...



పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న గ్రామస్తులు

పాఠశాలలో పైకప్పు పెచ్చులూడి కింద పడిందని తెలిసిన గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు తమ పిల్లలను పంపడం భయంగా ఉందని రేపటి నుండి పంపమన్నారు. అధికారులు వచ్చి పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. సంఘటనపై ఎంఈవో మధుసూదన్‌ను వివరణ కోరగా మన ఊరు–మన బడి రెండవ దశలో భవనం కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు వస్తే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

గొర్రెల కాపరి ఆచూకీ లభ్యం

- డయల్ 100 స్పందనతో రంగంలోకి పోలీసులు

దస్తురాబాద్: కవ్వాల్ అభయారణ్యంలో తప్పిపోయిన గొర్రెల కాపరి ఆచూకీ ఎట్టకేలకు గురువారం తెలిసింది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి గుండా శ్రీనివాస్ బుధవారం ఉదయం గొర్రెలను మేపేందుకు ఆకోండపేట సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై డయల్ 100కు ఫిర్యాదు చేశారు.

రంగంలోకి పోలీసులు..

డయల్ 100కు ఫోన్‌కాల్ రావటంతో స్పందించిన ఖానాపూర్ సీఐ సైదారావ్ పోలీసులను అప్రమత్తం చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి కానిస్టేబళ్లు శ్రావణ్, సురేందర్, రవి, స్థానికు యువకులను వెంట బెట్టుకుని కవ్వాల్ అభయారణ్యంలోకి వెళ్లారు. అర్ధరాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం కడెం మండలంలోని కల్లెడ అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. గ్రామస్తుల సమాచారంతో రెండు బృందాలుగా విడిపోయి అడవిలో జల్లెడ పట్టారు. జన్నారం మండలంలోని నర్సింగపురం గ్రామ సమీపంలో గొర్రెల సమూహం కనిపించినట్లు సమాచారం అందడంతో పోలీసులు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా అడవిలోనే పెద్ద బండారాయిపై గొర్రెల కాపరి కనిపించాడు. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులతో గొర్రెల కాపరి

పోలీసులను అభినందించిన ఎస్పీ

డయల్ 100 స్పందనతో కవ్వాల్ అభయారణ్యంలో గొర్రెల కాపరిని కాపాడి, మిస్సింగ్ కేసును కొన్ని గంటల్లో ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100ను వినియోగించుకోవాలని సూచించారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులకు సూచించారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల మండల, జిల్లా స్థాయి అధికారులతో గురువారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ తోడ్పడుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు చేసేలా గ్రామీణ యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రతీ మండలం నుంచి నూతన ఆవిష్కరణలను ఆగస్టు 3వ తేదీలోపు 9100678543 నంబరుకు ఆవిష్కర్త యొక్క పేరు, చిరునామా, ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, సంబంధిత వివరాలను వీడియో రూపంలో తీసి వాట్సప్ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఆగస్టు 15వ తేదీన ఆవిష్కరణల ప్రదర్శన, ఉత్తమ ఆవిష్కరణల ఎంపిక, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. జూమ్ మీటింగ్‌లో డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఈడీఎం నదీమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్ లో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు జిల్లా కేంద్రంలోని పొద్దుటూరి కాంప్లెక్స్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు నిర్వహిస్తున్న శిక్షణను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి లక్ష్యాలు, ఉద్దేశాలను వడ్రంగి లబ్ధిదారులకు వివరించారు. ప్రతీ లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డీఎం నరసింహారెడ్డి, మెప్మా పీడీ సుభాష్, శిక్షణ నిర్వాహకుడు రాజు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణలో లబ్ధిదారులు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంజాయి స్వాధీనం

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న 4 కిలోల 82 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎస్సై మనోహర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉట్నూర్‌కు చెందిన తవారే బాలాజీ, ఏపీకి చెందిన దుర్గ వంశీసాయి, బండారి గణేశ్ గంజాయిని తీసుకురాగా ఇంద్రవెల్లికి చెందిన శకావత్ గోవింద్ వారిని శ్యాంపూర్ వైపు తీసుకెళ్తున్నాడు. నలుగురు వ్యక్తులు ఒక తెలుపు రంగు సంచితో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. సమావేశంలో సీఐ మొగిలి, ఇంద్రవెల్లి, ఉట్నూర్ ఎస్సైలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లక్ష్మణ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బొప్పరికుంట గ్రామానికి చెందిన టేకం లక్ష్మణ్ (28) గంగాపూర్‌వాగులో శనివారం గల్లంతైన విషయం తెలిసిందే..ఐదు రోజుల నుండి గాలింపు చర్యలు చేపట్టగా గురువారం వా గులో చెట్టు కొమ్మకు మృతదేహం తట్టుకొని ఉన్న ట్లు గుర్తించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై దిలీప్, వైద్య సిబ్బంది వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

యువతి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన అగ్గిమల్ల స్రవంతి (22) సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. గ్రామానికి చెందిన అగ్గిమల్ల గంగాధర్ కుమార్తె స్రవంతి మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆమె బాబాయ్ ఇంట్లో ఉంటోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డప్పు కొడుతూ వ్యక్తి మృతి

కాసిపేట: మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాడపాక బాపు (55) గురువారం దహన సంస్కారాల్లో డప్పు కొడుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముత్యంపల్లికి చెందిన వేల్పుల అంకులు అనే సింగరేణి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు వాయించేందుకు వెళ్లిన బాపు కొద్దిదూరం వెళ్లగానే తలనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే బైక్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. మృతునికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుండెపోటుతో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన పోరేత్ అశ్విని (23) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. అశ్విని కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుందని, మందులు వాడినా తగ్గలేదన్నారు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

లక్ష్మణచాంద: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గురువారం పార్‌పెల్లిలో దావ మల్లయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పీరాజీ కూలిన ఇంటిని పరిశీలించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య కోరుతున్నాడు.

దాడులు చేస్తున్న ముఠా అరెస్ట్

నిర్మల్‌టౌన్: ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడులు చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. మామడ మండలం తాండ్రకు చెందిన రాథోడ్ గణేశ్ కూతురు, అల్లుడు పట్టణంలోని ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. గణేశ్ చికిత్స కొరకు రూ.45 వేలు జేబులో పెట్టుకొని నిర్మల్‌లోని పాత బస్టాండ్ వద్ద ఆగాడు. ఆ సమయంలో నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడుకు చెందిన బోసు రుక్మా, రాపాని రుక్మాక్క, బోసు శాంత, సాయన్న, పట్టణంలోని బుధవార్ పేట్‌కు చెందిన కర్రోళ్ల సాగర్, సాయవ్వలు గణేశ్‌ను కొట్టి ఆటోలో ఎక్కించుకొని పట్టణ శివారు ప్రాంతంలోని శ్యామ్‌ఘడ్ వద్దకు తీసుకెళ్లారు. అతని వద్ద ఉన్న రూ.45 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం పట్టణంలో తనిఖీ చేస్తుండగా ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

బోడ కాకర కిలో రూ.500



మనకు ప్రకృతి ప్రసాదించిన కూరగాయల్లో బోడ కాకరకాయ ఒకటి. వీటినే అకాకర కాయ, అడవి కాకరకాయ అని కూడా పిలుస్తారు. చూసేందుకు మామూలు కాకర కాయల మాదిరిగానే ఉన్నా, రుచిలో మాత్రం వ్యత్యాసం ఉంటుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో కిలో బోడకాకర రూ.500 పలుకుతోంది. ధర కాస్తా ఎక్కువగానే ఉన్నా, ఆరోగ్య ప్రయోజనాలు ఉండడంతో చాలా మంది కొనుగోలు చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోగుల కష్టం.. మోయలేని భారం



నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాల్సిన రిమ్స్ ఆస్పత్రిలో కనీస వసతులు కరువయ్యాయి. పేషెంట్‌కేర్‌ల సంఖ్య తగినంతగా లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. తాజాగా ఓ రోగిని తోటి రోగి స్ట్రేచర్‌పై తీసుకెళ్తున్న దృశ్యం రిమ్స్‌లో దుస్థితికి అద్దం పడుతోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్